క్లుప్తంగా

'ఉపా' కేసులు గర్హనీయం



మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య తదితరులపై ఉపా చట్టం కింద కేసులు నమోదు చేయడం దుర్మార్గమని న్యూడెమొక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వెంకటేశ్వరరావు ఆరోపించారు. కొత్తగూడెంలోని న్యూడెమొక్రసీ కార్యాలయంలో శనివారం ఉపా కేసుకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. తెలంగాణ కోసం పోరాడిన వారిపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు నిర్బంధం ప్రయోగిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఉద్యమాలపై అణచివేతను ఆయన బాటలో కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. 2014లో ముఖ్యమంత్రి అయిన తరువాత కేసీఆర్ 2015లో ఆగస్టులో ఆళ్లపల్లి పోలీసులు 123 మందిపై ఉపా కేసు పెట్టారని, నాటి నుంచి నేటి వరకు కేసీఆర్ ప్రభుత్వం అనేక కేసులు పెట్టించారని విమర్శించారు.కాగా, సదస్సు అనంతరం కేసులు ఎత్తివేయాలనే డిమాండ్‌తో ర్యాలీ నిర్వహించారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు అనురాధ, జే. సీతారామయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.

పోడు సాగుదారులందరికీ పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న ముద్దా బిక్షం

జూలూరుపాడు: పోడు సాగుసాదులందరికీ పట్టా హక్కు కల్పించకపోతే మరో పోరాటం తప్పదని ఏఐకేఎస్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు ముద్దా బిక్షం, జాటోత్ కృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐకేఎస్)– అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో శనివారం జూలూరుపాడులో కొత్తగూడెం డివిజన్ స్థాయి జనరల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో 12 లక్షల ఎకరాలకు పోడు హక్కు పట్టాలు ఇవ్వాల్సి ఉండగా కేవలం 4 లక్షల ఎకరాలకు మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం అన్యాయమన్నారు. పోడు సాగుదారులందరూ చైతన్యవంతంగా ఆలోచించి మరో పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి కిషోర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాయిని, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శి బానోత్ ధర్మా, గుగులోత్ రామ్‌చందర్, మాచర్ల సత్యం, ఆజాద్, వై గోపాల్‌రావు, గోకు నర్సయ్య, లింగాల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

వరద వస్తే అంతే సంగతి!

- ముర్రేడువాగుతో గూడెం పరిసర ప్రాంతాల్లో భయంభయం
- భారీ వర్షాలు వస్తే తప్పని తిప్పలు
- అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక ఏటా ఆందోళనే

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణాన్ని ఆనుకొని ఉన్న ముర్రేడు వాగు పరిసర ప్రాంతాల ప్రజలు ప్రతి వర్షాకాలం ప్రాణ భయంతో జీవనం సాగిస్తున్నారు. భారీ వర్షాలొస్తే లక్ష్మీదేవిపల్లి మండలంలోని ముర్రేడు వాగు పరీవాహక కాలనీలు సంజయ్‌నగర్ పంచాయతీ ఉపేంద్రకాలనీ వాసులు ఇళ్లు వరదమయం అవుతాయి. గత సంవత్సరం భారీ వర్షాల కారణంగా పదిహేను ఇళ్లు కోతకు గురై నేలమట్టం అయ్యాయి. దీంతో అక్కడి ప్రజలు ప్రతి వర్షాకాలంలో భయాందోళనతో ఇళ్లల్లో బిక్కుబిక్కు మంటున్నారు. వీరంతా రోజువారీ కూలీ పనులు చేసుకొని జీవనం సాగించేవాళ్లే. ఇక్కడ సుమారు అరవైకి పైగా ముంపునకు గురయ్యే ఇళ్లు ఉన్నాయి. వర్షాకాలంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకునే నాథులే కరువయ్యారు.

పదుల సంఖ్యలో ఇళ్లకు ముప్పు..

లక్ష్మీదేవిపల్లి మండలంలోని ముర్రేడు వాగు పరివాహక ప్రాంతాలైన సంజయ్‌నగర్, ఉపేంద్ర కాలనీలో గత సంవత్సరం వర్షాల కారణంగా పలువురి ఇళ్లు ముంపునకు గురయ్యాయి. దీంతో వారు గత్యంతరం లేక మరో ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే తిరిగి తమ ఇళ్లకు చేరుకుంటున్నారు. కాగా, ఇటీవల కొత్తగూడెంకు వచ్చినా సీఎం కేసీఆర్‌కు ముర్రేడువాగు పరివాక ప్రాంతాలలో ఇళ్లకు రక్షణ కల్పించాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు విన్నవించారు. సంజయ్‌నగర్, ఉపేంద్రకాలనీలోని ఇళ్లు వరద ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కానీ ఇంతవరకు కార్యాచరణ మొదలు కాలేదు. ఈ విషయమై నీటి పారుదలశాఖ డీఈ రాంబాబును వివరణ కోరగా... సంజయ్‌నగర్, ఉపేంద్రకాలనీలో గ్యాబియోన్ వాల్స్ నిర్మాణానికి రూ.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు. ఈ గోడల వల్ల వరద వచ్చినప్పుడు సమీప ప్రాంతాలు కోతకు గురికావు. ఆమోదం రాగానే నిధుల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు.



వరద ప్రవాహంతో కోతకు గురైన ప్రాంతం



ప్రమాదకరంగా ఇళ్లు

వరదకు ఇల్లు కూలింది



ప్రతిఏటా వర్షాకాలం వస్తుందంటే మాకు వరదలతో భయంగా ఉంది. గత సంవత్సరం కురిసిన వర్షాలతో ఇల్లు కూలింది. మళ్లీ వర్షాకాలం వచ్చినా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇకనైనా స్పందించి మా ప్రాంతాలకు రక్షణ కల్పించేలా చొరవ తీసుకోవాలి. – గడ్డం దుర్గాప్రసాద్

భద్రత కల్పించండి



ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా మా సమస్యను పట్టించుకోవడం లేదు. గత సంవత్సరం వరద కారణంగా మా ఇల్లు ధ్వంసం అయింది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఈసారైనా వరద రాకముందే ముర్రేడు వాగు పరివాహక ప్రాంతంలో రక్షణగా గోడ నిర్మించాలి. – రాజేశ్వరి

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచ: పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి అల్లూరి సెంటర్ వరకు సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసిన అధికారులు శనివారం రాత్రి లైట్లను వెలిగించి ట్రైయల్ రన్ వేశారు. కిన్నెరసాని రోడ్డు విస్తరణ పనుల్లో సెంట్రల్ లైటింగ్ పనులు నెలల తరబడి జాప్యం చేశారు. ఈ క్రమంలో గతనెల 26వ తేదీన 'అంతా అయింది లైట్లు ఏవి'అనే శీర్షికను సాక్షి పత్రికలో వార్తా కథనం ప్రచురితం అయింది. దీంతో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు స్పందించారు. ఈ మేరకు సంబంధింత అధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు మరుసటి రోజు నుంచి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. పదిరోజుల్లో లైటింగ్ పనులు పూర్తిచేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి అన్ని లైట్లను పరిశీలించారు. త్వరలో ఎమ్మెల్యే వనమా చేతులమీదుగా ప్రారంభించనున్నారు.



అంబేద్కర్ సెంటర్‌లో సెంట్రల్ లైటింగ్

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను నియమించాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

శనివారం కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ లేక ప్రభుత్వ రంగ, ప్రైవేట్ రంగ సంస్థలైన సింగరేణి, ఎన్టీపీసీ, బీటీపీఎస్, నవభారత్ లాంటి పరిశ్రమలల్లో ఎస్సీ, ఎస్టీల హక్కులు, సమస్యలు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మోరే రమేష్‌కుమార్, మల్లేష్, కేఎం విక్టర్, ఊట్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఇక్కడే సర్దుబాటు చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకే ఓసీ కార్మికులను కొత్తగూడెంలోని వివిధ డిపార్ట్‌మెంట్లలో సర్దుబాటు చేయాలని ఏరియా జనరల్ మేనేజర్ శాలేము రాజును ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ కోరారు. శనివారం జీఎంను ఆయన చాంబర్‌లో కలిసి పలు అంశాలపై చర్చించారు.

స్పందించిన జీఎం ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

కేఓసీలో భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న సౌరభ్ సుమన్

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్ కాస్టులో శనివారం భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ సౌరభ్ సుమన్ మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా రక్షణ సూత్రాలను పాటించాలని, ప్రమాద రహిత ఉత్పత్తిని సాధించాలన్నారు. జూలై నెలలో ప్రత్యేకంగా నా భద్రత – నా బాధ్యత – నా కుటుంబ బాధ్యత అనే నినాదంతో ప్రతి ఉద్యోగి ప్రమాద రహిత మాసంగా విధులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కేఓసీ రక్షణాధికారి కేఎస్ఎన్ రాజు, డిప్యూటీ మేనేజర్లు రవికుమార్, బ్రహ్మం, ఇంజనీర్ నాగశేషు, అశోక్, పిట్ కార్యదర్శి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ తోలకాలు

ఇల్లెందు: రాజకీయ అండతో కొంతమంది ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘించి అక్రమంగా గ్రావెల్ తోలకాలకు పాల్పడుతున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు చింత ఉపేందర్ ఆరోపించారు.

శనివారం రాత్రి ఆయన మాట్లాడుతూ.. ఇల్లెందు మండలం నాయకులగూడెం చెరువు నుంచి ఇటుక బట్టీ వ్యాపారులు, పెంకు ఫ్యాక్టరీల యజమానులు అనుమతులు లేకుండా పెసా నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఏజెన్సీలో ఇలా దందా జరుగుతున్నా అధికారుల ఉదాసీనత తగదని చర్యలు తీసుకోవాలని కోరారు.

11న శీత్లా పండగ నిర్వహించుకుందాం..

ఇల్లెందురూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11న శీత్లా పండగను జరుపుకోవాలని సేవాలాల్ సేన జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు వాంకుడోత్ రమేష్‌నాయక్ కోరారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. పునర్వసు కార్తె మొదటి మంగళవారం శీత్లా పండగను జరుపుకోవడం బంజారాలకు ఆచారంగా వస్తోందని గుర్తుచేశారు. కానీ పండుగను గత కొన్నేళ్లుగా పలుచోట్ల వేర్వేరు తేదీల్లో నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. బంజారాల ఐక్యతను చాటుకోవడంతోపాటు జాతి సంప్రదాయాలను ముందుతరాలకు చాటిచెప్పేందుకు పండగను సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



జీపీ కార్మికులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

జూలూరుపాడు: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమని, అధైర్య పడవద్దని, అధికారంలోకి రాగానే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని గ్రామ పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం భద్రాచలం వెళ్తూ శ్రీసాయిబాబా ఆలయంలో వద్ద ఆగారు. ఈ సందర్భంగా జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, వెంగన్నపాలెం ఎంపీటీసీ సభ్యుడు దుద్దుకూరి మధుసూదన్‌రావు, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా నిరసన దీక్షలు చేస్తున్న దీక్షా శిబిరాన్ని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించి, తమ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బానోత్ విజయ బాయి, లేళ్ల గోపాల్ రెడ్డి, నర్వనేని పుల్లారావు, ధరావత్ రాంబాబు, యల్లంకి చిన్న నాగేశ్వరరావు, దుద్దుకూరి నరసింహారావు, కల్యాణపు నరేష్, పోతురాజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న పొంగులేటి..

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయాన్ని శనివారం ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లికృష్ణ, చల్లా వెంకటరావు ఉన్నారు.

అమలుకు నోచుకోని విభజన హామీలు



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

పాల్వంచ: రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా తెలంగాణలో అడుగుపెట్టే హక్కు ప్రధాని మోదీకి లేదని సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మోదీ పర్యటనను నిరసిస్తూ నిరసన తెలిపారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బయ్యారం ఉక్కు పరిశ్రమ, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా, గిరిజన, మైనింగ్ విశ్వవిద్యాలయం వంటి విభజన హామీలను అమలు చేయకుండా తెలంగాణకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. తెలంగాణకు గుండెకాయ అయిన బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేయబోనని చెబుతూనే నాలుగు గనులను ప్రైవేటీకరించే చర్యలకు పూనుకున్నారన్నారిని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ విధానాల వలన దేశంలో వివిధ రంగాల్లో జరుగుతున్న అన్యాయాలను, దేశ సమైక్యత, సమగ్రతలకు భంగం వాటిల్లే ప్రమాదాలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి లక్షలాది మంది ఉద్యోగులను, కార్మికులను రోడ్డుపాలు చేస్తున్నారని, కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చే చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఎనిమిదేళ్లలో తెలంగాణ రాష్ట్రానికి ప్రభుత్వం చేసిందేమీ లేదని, వివక్షతో రాష్ట్రాన్ని దివాలా తీయించే చర్యలకు దిగుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో ఉప్పుశెట్టి రాహుల్, పద్మజ, డి.సుధాకర్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు, నరహరి నాగేశ్వరరావు, శనగరపు శ్రీనివాస్, జ్యోతుల రమేష్, బిక్కులాల్, సత్యనారాయణ, అజిత్, వెంకన్న, ఎండీ పాషా, వెంకటేశ్వర్లు, రవి, కిరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

టేకులపల్లి: మండలంలోని ప్రెగళ్లపాడు గ్రామ పంచాయతీ శాఖ మున్నూరు కాపు సంక్షేమ సంఘం నూతన కమిటీని శనివారం ముత్యాలంపాడు ఆంజనేయస్వామి ఆలయం వద్ద జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంది వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా నర్సింగ్ శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడిగా యాసా నాగేశ్వరరావు, కార్యదర్శిగా పాశం హరినాథ్, కోశాధికారిగా అప్పికట్ల హనుమంతరావు, సహాయ కార్యదర్శులుగా బండ్ల కృష్ణ, హన్మకొండ రామయ్య, లక్కినేని సత్యం, పసుపులేటి అప్పారావు, ముప్పిడి వెంకట్ నాయుడు, ప్రచార కార్యదర్శిగా నర్సింగ్ నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్కినేని వెంకటేశ్వరరావు, లక్కినేని శ్యాం, లక్కినేని రంగా, లక్కినేని కృష్ణ, నర్సింగ్ రవి, గంగారపు కోటేశ్వర్‌రావు, నారందాస్ కోటయ్య, సంపత్, వెంకటేశ్వర్లు, దోర్నాల శ్రీనివాస్, గంగారంపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు సంఘీభావం

పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెకు మూడోరోజు శనివారం కాంగ్రెస్, ఇఫ్టూ అనుబంధ తెలంగాణ భవన నిర్మాణ రంగ సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. వక్తలు మాట్లాడుతూ.. అవార్డులు పొందుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చిత్తశుద్ధి లేకపోవటం దురదృష్టకరమన్నారు. తక్షణమే సమ్మెను విరమింపజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
– సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న అనురాధ



పాల్వంచరూరల్: మద్దతు తెలుపుతున్న రమేష్



ఇల్లెందు: మాట్లాడుతున్న ఆవునూరి మధు



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు చీమల వెంకటేశ్వర్లు



సుజాతనగర్: సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అటెన్షన్ ప్లీజ్



ఒరిగిన విద్యుత్ స్తంభాలు..

టేకులపల్లి మండలం దాసుతండా నుంచి చుక్కాలబోడు క్రాస్ రోడ్డు వరకు విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రధాన రహదారి వెంబడి సుమారు పది స్తంభాలు ఒరిగిపోవడం గమనార్హం. ఈ స్తంభాలన్నీ పంట పొలాల్లోనే ఉండటంతో రైతులు వ్యవసాయ పనులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎటువంటి ప్రమాదం జరగక ముందే విద్యుత్ అధికారులు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. - టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : దేవా నాయక్,
ఏఈ, టేకులపల్లి
సెల్ నెంబర్: 94408 11562



ప్రజల గుండెల్లో వైఎస్ఆర్ సజీవం



పాల్వంచరూరల్: పాండురంగాపురంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 74వ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. పలువురు మాట్లాడుతూ.. మహానేత వైఎస్ఆర్ ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచారన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు, నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకాలను అందుబాటులోకి తెచ్చారని, వృద్ధులకు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లు అందించారన్నారు. మహనేత వైఎస్ఆర్ ఆశయ సాధనకై కాంగ్రెస్ వాదులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు.
– సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య



జూలూరుపాడు: పూలమాలల వేస్తున్న బొద్దు కృష్ణయ్య, లేళ్ల వెంకటరెడ్డి



సుజాతనగర్‌లో వైఎస్ఆర్‌కు నివాళులు



కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఇల్లెందు: ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో...



ఇల్లెందు: జగదాంబా సెంటర్‌లో..



కొత్తగూడెంరూరల్: వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎడవల్లి కృష్ణ